## క్లుప్తంగా

### ఘనంగా రామానుజాచార్యుల జయంతి



వేడుకలో పాల్గొన్న భక్తులు

చేర్యాల(సిద్దిపేట): దైవం దృష్టిలో అందరూ సమానమేనని తన బోధనలతో ప్రపంచానికి చాటిన రామానుజ జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక వేణు గోపాలస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శేషాచార్యులు, రాజు స్వామి ఆధ్వర్యంలో ఆగమశాస్త్ర వైష్ణవ సంప్రదాయంలో జరిపిన ఈ వేడుకల్లో రామానుజస్వామికి అభిషేకం, పారాయణ, అర్చన చేశారు. కార్యక్రమంలో స్థానికులు రామ్మూర్తి, రాంప్రకాశ్, వాసు, ఆండాలు తదితరులు పాల్గొన్నారు.

### పాలీసెట్‌కు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న గోవర్ధన్

నంగునూరు(సిద్దిపేట): పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించే పాలీసెట్ కోసం రాజగోపాల్‌పేట కళాశాలలో ఉచిత కోచింగ్ క్యాంపు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 5వ తేదీ నుంచి 12 వరకు ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. అలాగే ఉచితంగా స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తామని చెప్పారు. విద్యార్థులు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కవిత తోపాటు ప్రిన్సిపాల్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

### శాంతిని నెలకొల్పండి



సమావేశంలో పాల్గొన్న రచయితలు

సిద్దిపేటకమాన్: శాంతి చర్చలకు ప్రతిపాదించిన మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతికి చొరవ చూపాలని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చత్తీస్‌గఢ్, బస్తర్, తెలంగాణలోని దండకారణ్య ప్రాంతాల్లో కొనసాగిస్తున్న మిలిటరీ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలన్నారు. ఆదివాసులు జీవించే హక్కును కాలరాయడమే అవుతుందని, కాల్పుల విరమణ పాటించి మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు. కార్యక్రమంలో మంజీర రచయితల సంఘం అధ్యక్షుడు, జిల్లా వర్కింగ్ జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రతినిధులు భగవాన్‌రెడ్డి, అశోక్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 135 మందికి చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న విజయ మోహన్, ఆరీఫా

ములుగు(గజ్వేల్): స్థానిక రైతు వేదికలో అధికారులు శుక్రవారం 135 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.1.35కోట్ల విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ ఆరీఫా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ‘పది’లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న హెచ్‌ఎం స్వప్న

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని, అందుకు పదో తరగతి ఫలితాలే అందుకు నిదర్శనమని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం స్వప్న అన్నారు. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో 500పైగా మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదో తరగతి ఫలితాల్లో తమ పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. గౌసియా సుహానా 556, సుహానా 546, శ్రీవర్ష 537, వైష్ణవి 536, నయనశ్రీ 522, సిరిచందన 513 మార్కులు సాధించారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఏపీసీ చైర్మన్ భాగ్యమ్మ తదితరులున్నారు.

# రైల్వే స్టేషన్‌కు రహదారేదీ?

సిద్దిపేట ప్రజల రైలు సౌకర్యం కల నెరవేరింది. కానీ రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో ఇబ్బందులు పడవలసి వస్తోంది. పట్టణానికి దూరంగా నర్సాపూర్, మిట్టపల్లి శివారులో నిర్మించారు. దీంతో రైలు సౌకర్యం అందుబాటులోకి వచ్చినా ప్రత్యేక వాహనాలలో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

- స్టేషన్‌కు వెళ్లేందుకు ఇబ్బందులు
- లారీల రాకపోకలకు అదేపరిస్థితి
- భారీ వాహనాలతో స్థానికుల ఆందోళన



సిద్దిపేటలో నూతనంగా నిర్మించిన రైల్వే స్టేషన్

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట-వరంగల్ జాతీయ రహదారి నుంచి సుమారు రెండు కిమీ దూరంలో స్టేషన్ నిర్మించారు. జాతీయ రహదారి నుంచి నేరుగా స్టేషన్ వరకు రోడ్డు మార్గం మాత్రం నిర్మించలేదు. అలాగే రాజీవ్ రహదారి నుంచి సుమారు 2 కి.మీ దూరంలో స్టేషన్ ఉంటుంది. డబుల్ బెడ్రూం కాలనీ వెనక వైపు నుంచి వెళ్లాల్సి ఉంటుంది. ఆ దారి సరిగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రయాణికులు స్టేషన్‌కు చేరుకోవాలంటే ప్రత్యేకంగా కిరాయి ఆటో తీసుకొని రావాల్సి వస్తుండడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. రాజీవ్ రహదారి నుంచి, జాతీయ రహదారి నుంచి రైల్వేస్టేషన్‌కు ప్రత్యేక రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

**గూడ్స్ లారీలతో కాలనీవాసుల ఆందోళన**

సిద్దిపేట రైల్వేస్టేషన్ నుంచి గూడ్స్ రైలులో వివిధ రాష్ట్రాలకు బియ్యం రవాణా జరుగుతోంది. సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో బియ్యం లోడుతో కూడిన లారీలు గుండ్లచెరువు కాలనీ మీదుగా మట్టి రోడ్డుపై రైల్వే స్టేషన్‌కు చేరుకుంటున్నాయి. లారీలు ప్రయాణించే సమయంలో కాలనీలో ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్ రహదారి నుంచి గుండ్ల చెరువు కాలనీకి చేరడానికి సర్వీసు రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో వాహనదారులు రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సర్వీసు రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి ప్రమాదాలను నివారించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



బియ్యం లోడుతో వెళ్తున్న లారీలు

**భారీ వాహనాల కోసం రోడ్డు వేయాలి**



లారీలు, ఇతర భారీ వాహనాల కోసం హుస్నాబాద్ రోడ్డు కరీంనగర్ రోడ్డును కలుపుతూ రైల్వే ట్రాక్ వెంబడి రోడ్డు నిర్మించాలి. కరీంనగర్ బైపాస్ రోడ్డు యాదవ ఫంక్షన్ హాల్ నుంచి రైల్వే స్టేషన్ వరకు గుండ్లచెరువు కాలనీ మీదుగా ప్రయాణికుల కోసం తారు రోడ్డు నిర్మించాలి.

– చెరుకు దేవరాజు, గుండ్లచెరువు కాలనీ

**ప్రమాదాలు నివారించండి**



గుండ్ల చెరువు, డబుల్ బెడ్రూం కాలనీవాసుల కోసం రాజీవ్ రహదారి వెంబడి సర్వీస్ రోడ్డును త్వరగా నిర్మించాలి. రోడ్డు లేకపోవడంతో రాజీవ్ రహదారిపై రాంగ్ రూట్‌లో ప్రయాణించాల్సి వస్తోంది. దీని వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు నిర్మించి ప్రమాదాలు నివారించాలి.

– ఆవుల రవికుమార్, గుండ్లచెరువు కాలనీ

## కులగణన నిర్ణయం చరిత్రాత్మకం

బీజేపీ నాయకులు

హుస్నాబాద్: దేశవ్యాప్తంగా జనగణన, కులగణన సర్వే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం చరిత్రాత్మకమైనదని బీజేపీ నాయకులన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ ఏనాడూ కులాలవారీగా జనాభాను లెక్కించిన దాఖలాలు లేవన్నారు. తెలంగాణ ప్రభుత్వం తప్పుల తడకగా సర్వే నిర్వహించి ముస్లింలను బీసీల్లో చేర్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వల్లనే మోదీ కులగణన నిర్ణయం తీసుకున్నారని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సంపత్ నాయక్, సతీశ్, శంకర్‌బాబు, చందు, లక్ష్మణ్, రాంప్రసాద్, లక్ష్మయ్య, రవీందర్, నాగార్జున తదితరులు ఉన్నారు.



మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

**దుబ్బాకలో..**

దుబ్బాక: బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ నేతృత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, వెంకట్‌గౌడ్, ప్రవీణ్, భాస్కర్, వంశీ, నేహాల్, రమణారెడ్డి, బద్రి, సాయికుమార్, యాదయ్య, పరశురాములు తదితరులు ఉన్నారు.

## ఘనంగా పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం



యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ చైర్మన్ వెంకటయ్య

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని తిర్మలాపూర్ పెద్దమ్మ తల్లి జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో నిర్వాహకులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు. అనంతరం బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఆ పెద్దమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలన్నారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ సమన్వయ కర్త రణం శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## భక్తులందరిపై సీతారాముల ఆశీస్సులు

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: భద్రాచల సీతారాముల ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. భద్రాచలం సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించన తలంబ్రాలు గజ్వేల్‌కు చేరుకున్న సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆ తలంబ్రాలను ఈ ప్రాంత భక్తులకు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు రామకోటి రామరాజు మాట్లాడుతూ భద్రాచలం నుంచి వచ్చిన 100 కిలోల ముత్యాల తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. త్వరలోనే భక్తులందరికీ అందించనున్నట్లు తెలిపారు. దైవ కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, సామాజిక సమరతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

## ‘ఎమ్మెల్యే ఆన్ వీల్స్’తో సమస్యల పరిష్కారం

కలెక్టర్ మనుచౌదరి




ఎమ్మెల్యే సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే ఆన్ వీల్స్ వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

బెజ్జంకి(సిద్దిపేట): నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికే ‘ఎమ్మెల్యే ఆన్ వీల్స్’ వాహనాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అందుబాటులోకి తెచ్చారని కలెక్టర్ మనుచౌదరి చెప్పారు. ఎమ్మెల్యేతో కలిసి శుక్రవారం ఆయన బెజ్జంకిలో ఆ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల గురించి చెప్పడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం కూడా ఈ వాహన సిబ్బందికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో ప్రధానమైనది భూముల సమస్య అని, వాటి పరిష్కారం కోసం భూభారతిని ప్రభుత్వం తీసుకు వచ్చిందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం చింత పడొవద్దన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో సమస్యలు నమోదు చేసి సంబంధిత అధికారులకు నివేదిస్తారని చెప్పారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. సీఆర్‌ఆర్ నిధుల నుంచి మంజూరైన రూ.50లక్షలతో నిర్మించనున్న తకల్లెపెల్లి-గూడెం కల్వర్టుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, రత్నాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య పాల్గొన్నారు.

**నమూనా ఇంటి నిర్మాణం పరిశీలన**

బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనా నిర్మాణాన్ని కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసే రూ.5 లక్షలతో ఇంటిని నిర్మించుకోవచన్న సందేశాన్ని లబ్ధిదారులకివ్వాలన్నారు.

**భూముల వివరాలు నమోదు చేయాలి**

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణరావుతో కలిసి భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో భూ భారతి చట్టం అమలుకు పైలెట్ ప్రాజెక్టుగా అక్కన్నపేట మండలాన్ని ఎంపిక చేశారన్నారు. 5 నుంచి 20వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహించి రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. సీపీ అనురాధ, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, ఆర్డీఓలు, హౌసింగ్ పీడీ, అక్కన్నపేట తహసీల్దార్, నీట్ పరీక్ష నిర్వహణ అధికారులు, డీఆర్డీఓ తదితరులు పాల్గొన్నారు.

### అడ్మిషన్లు ప్రారంభం

గజ్వేల్‌రూరల్: తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల టీఎస్‌ఎంఎస్(కళాశాల) ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వన్నెస తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంకు గాను ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలలో చేరేందుకు 5 నుంచి 20వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఆసక్తిగల వారు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### మందుబాబులకు జరిమాన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన వాహన తనిఖీల్లో 12 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.22,500 జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.

### నీట్ పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనలు: సీపీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో జరగనున్న నీట్ పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్‌ఎస్‌ఎస్ నిబంధనలు అమల్లో ఉంటాయని సీపీ అనురాధ తెలిపారు. 4వ తేదీన పరీక్ష జరగనున్న రెండు కేంద్రాల వద్ద మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 7 వరకు నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. ఆ సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని, ప్రజలు గుమిగూడి ఉండకూడదని ఆమె సూచించారు.

### మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో ఇటీవల పిడుగుపాటుకు మృతి చెందిన టేకు రంగవ్వ, గుండారంలోని కోరుకొప్పుల నారాయణ కుటుంబ సభ్యులను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మహిపాల్ రెడ్డి, లక్ష్మణ్, రమేశ్, రాజిరెడ్డి ఉన్నారు.

## కులగణన కాంగ్రెస్ పార్టీ చొరవే




లబ్ధిదారులతో కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టడం కాంగ్రెస్ పార్టీ చొరవే కారణమని ఆ పార్టీ నాయకులు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 150 మందికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన చేసినపుడు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు హేళన చేశారన్నారు. కాని నేడు కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ ఒత్తిడి కారణంగా కేంద్ర ప్రభుత్వం కులగణనకు ఆమోదం తెలిపిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుకు వెళ్తుందన్నారు. అనంతరం రాహుల్‌గాంధీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో యాదగిరి, లక్ష్మి, మహేందర్‌రావు, సతీశ్‌గౌడ్, ఆనంద్, రియాజొద్దీన్, ఎల్లం, షాబొద్దీన్, సంతోష, కలిమొద్దీన్, గోపీకృష్ణ, వహాబ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ బడుల్లోనే ఉత్తమ బోధన

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని నాగపురిలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారన్నారు. ఉచితంగా యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారన్నారు. హెచ్‌ఎం ఐలయ్య, మాజీ వైస్‌ఎంపీపీ కె.రాములు, ఉపాధ్యాయులు ఎస్.కృష్ణమూర్తి, టి.మనోజ్‌కుమార్, ప్రకాశ్‌రెడ్డి, స్వర్ణకుమార్, కనకలింగం, స్వామి పాల్గొన్నారు.



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ కరుణాకర్ తదితరులు

## మహిళల రక్షణకు ప్రభుత్వం పెద్దపీట




అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలతో షీ టీం బృందం

చేర్యాల(సిద్దిపేట): మహిళల రక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ షీ టీం సభ్యులు సూచించారు. పట్టణ కేంద్రంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లకు చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తుల మాటలు నమ్మొద్దన్నారు. రాత్రి సమయాల్లో ఇంటికి తాళంవేసి ఆరుబైట నిద్రించేవారు, వ్యవసాయ పనుల కోసం ఒంటరిగా వెళ్లే మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మహిళలను వేధించినా, అవహేళనగా మాట్లాడినా వెంటనే 100 లేదా షీటీం నంబరు 87126 67434కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు సదయ్య, ప్రశాంతి, స్వప్న, కృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

## ఉన్నత స్థానాల్లో నిలిచినపుడే గుర్తింపు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు ఉన్నత స్థానాల్లో నిలిచినపుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ప్రగతి, మంజీరా విద్యాసంస్థల కరస్పాండెంట్ అంబదాస్ అన్నారు. ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 7న నిర్వహించతలపెట్టిన జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం గజ్వేల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7న ఫార్మారంగంలో నిర్వహించే జాబ్‌మేళాలో బీఎస్సీ(కెమిస్ట్రీ) పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొని ఉద్యోగాలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ రామచంద్రం, రాజు, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు వినోద్, సభ్యులు సుధాకర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంబదాస్ తదితరులు

# పార్కులు ఇలా.. ఆహ్లాదం ఎలా

పల్లెల్లో ప్రజలకు ఆహ్లాదం పంచాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలోను పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వనంలో తీరొక్క మొక్కలను పెంచి ఆట వస్తువులను కూడా ఏర్పాటు చేశారు. అయితే వాటిపై పర్యవేక్షణ కరువైంది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. పిచ్చిమొక్కలు, పొదలు ఏపుగా పెరిగి పార్కులు అధ్వానంగా మారాయి. ఆట వస్తువులు తుప్పు పడుతున్నాయి.

- అధికారుల పర్యవేక్షణ కరువు
- ఎండిపోతున్న మొక్కలు
- తుప్పు పడుతున్న ఆట వస్తువులు




పిచ్చిమొక్కలతో నిండిన జంగంరెడ్డిపల్లిలోని పల్లె పార్కు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలో మొత్తం 29 గ్రామాలున్నాయి. అన్ని గ్రామాల్లోను పది గుంటల నుంచి ఎకరం వరకు ప్రభుత్వ స్థలాల్లో పార్కులను ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ నిధుల ద్వారా లక్ష నుంచి ఐదు లక్షలకుపైగా నిధులతో వివిధ చెట్లను పెంచారు. అలాగే పిల్లలు ఆటలు ఆడుకొనేందుకు, పెద్దలు వ్యాయామం చేసేందుకు పరికరాలను ఏర్పాటు చేశారు. చిన్న పంచాయతీల్లో నిధుల కొరత మూలంగా ఆట వస్తువులను ఏర్పాటు చేయలేదు. తిగుల్ గ్రామంలో ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన పార్కు ప్రస్తుతం పూర్తిగా కనుమరుగైంది. అనంతసాగర్, జంగంరెడ్డిపల్లి, చిన్నకిష్టాపూర్, తిగుల్ నర్సాపూర్, అంతాయిగూడ, ధర్మారం, కొత్తపేట, బీజీ వెంకటాపూర్ తదితర గ్రామాల్లో పల్లె పార్కులు అధ్వానంగా మారాయి.

**చర్యలు తీసుకొంటాం..**

గ్రామాల్లోని పల్లె పార్కుల్లో పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించే పనులు చేపడుతున్నాం. ప్రత్యేక దృష్టి సారించి, పార్కుల పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకొంటాం. అదేవిధంగా ఆట వస్తువులు ధ్వంసం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకొంటాం.

– రాంరెడ్డి, ఎంపీడీఓ

**పనులు నిరాకరిస్తున్న కూలీలు**

పర్యవేక్షణ లేకపోవడం వల్ల మొక్కలన్నీ ఎండిపోతున్నాయి. ఉపాధి హామీ కూలీలు పూడికతీత పనులు చేస్తున్నారు. గతంలో పార్కుల్లో చేసిన పనులకు కూలీ డబ్బులు రావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కుల్లో గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించడంలేదు. దీంతో పల్లె పార్కులు కళ తప్పాయి.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990